
# ఈ తరం ప్రేమకథ

★

రచన:

శ్రీ ఎగుమామిడి అయోధ్యారెడ్డి.



(గత సంచిక తరువాయి)

"హేయ్ రాధక్కా! నువ్వు కూడా మొదలెట్టావు అప్పుడే వేళాకోళం? రాజు ముఖం చిన్నదిగా చేసుకుంటూ అన్నాడు.

రాధ నవ్వింది. సానునయంగా రాజు వైపు చూస్తూ అంది "అబ్బెబ్బె! లేదే గానీ ఇంటి వద్ద అందరూ కులాసా? అమ్మా ... బాబాయ్ ...!"

"ఆఁ! అంతా కులాసాయె"

"ఎప్పుడు బయలు దేరారు అక్కణ్ణించి? ఇంతాలస్యమైందెందుకూ?"

నిన్ననే వచ్చింది బావ దగ్గర్నించి వుత్తరం! అది చూసీ చూడగానే హైదరాబాదు బయలు దేరేదాకా వెంటబడి తరిమాడు నాన్న. ఇక ఇక్కడ బస్సు దిగాక రిక్షా ఎక్కటం మన రచయితగాడి స్వభావానికి సరిపడదు కాబట్టి మెల్లగా నడుస్తు వచ్చేసరికి ఇదిగో ఇంతాలస్యమైంది."

రాజు మాటలు విని రాధ నవ్వుతూ రవివైపు చూసింది. "ఏరా! రచయితా!! నిజమా?" అంది.

సబ్బు పెట్టె చేతిలో పట్టుకుని, టవల్ భుజం మీద వేసుకుని కుళాయి వద్దకు వెళ్ళబోతున్న రవి



ఆగి "అంతా అబద్ధంలే అక్కయ్యా! నడిచి వస్తే మాత్రం ఇంత లేటవుతుందా? అయిన ఆలస్యమేదో ఇంటి దగ్గిరే అయింది" అని నవ్వుతూ వెళ్ళిపోయాడు.

"సరే రాజా! నువ్వు కాళ్ళు చేతులు కడుక్కో ఈ లోగా నేను కాఫీ తయారు చేస్తాను." అంటూ లోపలకు వెళ్ళి పోయింది రాధ.

"అవును గానీ రాధక్కా! ఇప్పుడేం కొంపలు ముంచుకు పోయాయి చెప్పు? నా పెళ్ళి కింత తొందర పడుతున్నారు మీరంతా!" రాధ చేతిలోంచి కాఫీ కప్పు అందుకుంటూ అన్నాడు రాజు.

"ఏం రాజా! నీ కిష్టం లేదా?" అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తు ప్రశ్నించింది రాధ.

"వాడికి ఇష్టం లేకపోవడ మేమిటక్కా! పైకి అలాఅంటున్నాడు గానీ, మనసులో మాత్రం పెళ్ళంటే మహాకోరికలే!" రవి కలుగ జేసుకుని నవ్వుతూ అన్నాడు.

రాజు కోపంగా చూశాడు రవివైపు. "అలా అని నీతో చెప్పానురా?" అని ప్రశ్నించాడు.

రవి వెనక్కి తగ్గలేదు. రాధ వైపు చూసి కళ్ళెగరేసి నవ్వుతూ అన్నాడు. "ఆ కోపం వట్టిదేలే అక్కా! మనసులో మాత్రం పెళ్ళి కోసం తహ తహ లాడిపోతున్నాడనుకో! బావనుండి వుత్తరం వచ్చిందగ్గర్నించి పెళ్ళికోసం తహ తహ లాడి పోతున్నాడనుకో! బావనుండి వుత్తరం వచ్చిం దగ్గర్నించి పెళ్ళికూతురు నెప్పుడు చూస్తానా! అని ఒకటే ఇదై పోతున్నాడు. నిన్నట్నించి మహా హుషారుగా వున్నాడులే!

రవి మాటలకు ఫక్కుమని నవ్వింది రాధ. "ఏం రాజా! నిజమా?" అంది. రాజు వైపు చూసి.

రాజు మందహాసం చేస్తూ అన్నాడు. "ఉన్నవి, లేనివి కల్పించి చెప్పడంలో రవి ఘటికుడని నీకు తెల్సుగా రాధక్కా! ఆ కల్పనా శక్తి చేతనే వాడు అంత పెద్ద రచయిత అయ్యాడని నేనేకాదు బావ గారు కూడా అంటారుగా."

Tel: EXPORT Phone: 21443

ఏనుగు బ్రాండ్

INDIA

CKC

సి. కె. సి. బనియన్లు

ధరించుటకు హాయినిచ్చును.

అన్ని చోట్ల దొరకును.

: తయారించువారు :

THE CARNATAKA KNITTING CO.,

Post Box No. 252

TIRUPUR-638602

"కేవలం కల్పనా శక్తి చేత రచయిత కాలేదన దానికి తోడుగా ఇంకా ఎన్నో కావాలి" మధ్యలోనే అన్నాడు రవి.

"చాల్లేవోయ్! ఆ మాటకొస్తే ప్రపంచంలో, ముఖ్యంగా మన దేశంలో పెళ్ళంటే సంబర పడని వాడు ఏడీ! ఒక్కడిని చూపించు చూద్దాం! ఈనాటి యువ తరంలో ఒక్క నువ్వు తప్ప అందరూ పెళ్ళి మాట వినగానే నాగస్వరం విన్న నాగుపాముల్లా తలలూపేస్తారు తెలుసా!"

రవి తేలిగ్గా నవ్వేసాడు. "ఎలాగైతేనేం వొప్పుకొన్నావుగా పెళ్ళంటే నీకు ఇష్టమేనని?"

"అవున్రా రవీ! పెళ్ళంటే ఇష్టపడనివారు ఈ రోజుల్లో చాలా తక్కువే. కాని నువ్వు మాత్రం ఆ విషయం ఎత్తితే చాలు మెల్లగా కప్పదాటు వేస్తావెందుకురా?" రాధ కూడా రెట్టించిడంతో రవి ఇక మాట్లాడ లేదు.

రాధకు తెల్సు రవి తన పెళ్ళి ప్రసక్తి వస్తే మౌనంగా వుండి పోతాడని ఆమెకు అదే విచారం తమ్ముడు పెళ్ళికి సుముఖంగా లేకపోవడం. ఇక ఆమె కూడా మాట్లాడకుండా వెళ్ళి వంట ప్రయత్నంలో పడింది.

రవి బట్టలేసుకుని ఓ ఫ్రెండును కలవాలంటూ బయటకు వెళ్ళి పోయాడు. రాజు వెళ్ళి పడక్కుర్చిలో మేను వాల్చాడు.

మర్నాడు ఉదయం!

కేశవ్ భోంచేసి బ్యాంక్ కు వెళ్ళిపోయాడు. రవీ, రాజా తాము కూడా అలా వెళ్ళొస్తామని రాధతో చెప్పి బయలుదేరి వెళ్ళి పోయారు.

సమయం పది గంటలవుతోంది. అలా తిరిగొచ్చిన మిత్రులిరువురు అలసిపోయి హోటల్ కామత్ లో కూర్చుండి టీ తాగుతున్నారు.

"ప్రస్థుత కార్యక్రమ మేమిట్రా రాజా!" ప్రశ్నించాడు రవి. హోటల్ లోకి వచ్చె పోయే మనుషుల వంక పరిశీలనగా చూస్తూ.

"ఏముందిరా! అలా తిరిగి ఓ మార్నింగ్ షో చూద్దాం! తర్వాత మెల్లగా నడచుకుంటూ వెళ్ళి ఆంధ్ర బాంక్ చేరుకుని బావగార్ని కలుద్దాం! అక్కణ్ణించి నేరుగా ......"

"అమ్మాయిని చూడ్డానికి, ఐమీన్ పెళ్ళి చూపులకు వెళదాం అంతేనా?" రవి నవ్వుతూ మిగతాది పూర్తి చేశాడు.

"అయితే ఇప్పట్నించే మొదలెట్టా వన్నమాట" పళ్ళు బిగపట్టి కోపంగా చూస్తూ గాంభీరంగా అనబోయి చిరునవ్వు నవ్వాడు రాజు.

రవి ప్రశ్నార్థకంగా చూస్తూ టీ కప్పు క్రింద పెట్టాడు.

"అదే! వేళాకోళం"

"ఓహో! అదా" ఫక్కున నవ్వేశాడు రవి.

రాజు కూడా మందహాసం చేశాడు. ఇరువురూ నవ్వుకుంటూ లేచారు. బిల్లు చెల్లించి బయటకు నడిచారు.

అప్పుడే రోడ్డు మీద వాహనాల పరుగులు మిక్కుటమయ్యాయ్. కాలినడకన నడిచేవాళ్ళు, సైకిళ్ళు, కార్లు, లోకల్ బస్సులు, జావాలు, స్కూటర్లు ఒకటేంటి అన్నీ పరిగెడుతున్నాయ్. అవతల ఏవో కొంపలు మునిగి పోతున్నట్లు, రకరకాల మనుషులు ఎవరికి వారే మాట్లాడుకుంటూ వెళ్ళి పోతున్నారు. ప్రశాంతత అనే పదం స్మరించడానిక్కూడా వీల్లేదక్కడ.

అంతా గందరగోళం! రణగొణ ధ్వనులు!! ఆపలేని హడావిడి.

రాజా, రవీ రోడ్డుకు ఎడంగా నడుస్తున్నారు. పేవ్‌మెంట్ మీదకూడా ఫ్రీగా నడవడానిక్కి వీల్లేకుండా పోయింది. జనం! క్రిక్కిరిసిన జనం! ఒకర్నొకరు రాచుకుంటూ ఢీకొంటూ నడుస్తున్నారు.

అలా వెళ్ళి విశ్రాంతి టాకీసులో ఏదైనా మార్నింగ్ షో చూద్దామని వెళుతున్నారు. మిత్రు లిరువురు అలా నడిచి నడిచి గౌలిగూడా చమన్ దాకా వచ్చారు.

కొద్ది దూరంలో సిటీ బస్సుకోసం నిలబడివున్న నల్గురు కాలేజీ అమ్మాయిలు తమ వైపే చూస్తున్నట్లుని పించటంతో రవి అటువైపు నిదానంగా చూసి ఉలిక్కిపడ్డాడు. అతని వదనంలో దాచిన దాగని ఆశ్చర్యం తొంగిచూసింది. వాళ్ళంతా తమలో తాము మాట్లాడుకుంటూ, నవ్వుతున్నారు. మధ్య మధ్య వీరి వైపుగా చూస్తున్నారు.

"ఒరేయ్ రాజూ! ఆ బస్ స్టాప్ వైపు చూడు ఆ మధ్యలో వున్న రెండు జడల అమ్మాయి ..."

రవి చెప్పటంతో రాజుకూడా అటువైపు చూసి నమ్మలేనట్టుగా అయిపోయాడు.

"ఆ అమ్మాయి నిన్న మనకు బస్‌లో అగుపించింది కదూ!" అన్నాడు రవి.

రవి మాటలు రాజు నమ్మలేదు "అబ్బే! కాదులేరా ఆ అమ్మాయి పల్లెటూరి పైతు. ఈ అమ్మాయి 'అల్ట్రా మోడరన్ సిటీ కాలేజి గర్ల్‌లావుంది" ఖచ్చితంగా తేల్చి చెప్పాడు రాజు.

ఈ లోగా రాజు, రవీ ఆ అమ్మాయిలకు దగ్గరగా వచ్చేశారు. రవి నిదానించి చూశాడు వారి దిక్కు. 'కాదు! రాజు అంచనా తప్పు. ఈ అమ్మాయి నిన్న తమతోపాటు బస్సులో ప్రయాణం చేసింది. ఆ పెద్ద పెద్ద కళ్ళు, పొడవైన ముక్కు, తాను పొరపాటు పడటంలేదు కాని—నిన్న బస్సులో ప్రయాణించిన అమ్మాయికీ ఈమెకూ చాలా వ్యత్యాసముంది. ఈ అమ్మాయి నవనాగరికంగా అలంకరించుకుంది. చిలక పచ్చని సింథటిక్ చీర మీద గులాబి రంగు బ్లౌజ్ వేసుకుంది. నిమ్మపండులాంటి శరీరచ్ఛాయ నిగా నిగా మెరుస్తోంది. ఎడం చేతికి రెండు గాజులు, కుడి చేతికి బ్లాక్ డైల్ రిస్టువాచి సుకుమారంగా, మనోహరంగా నవ్వుతోంది.

ఆమె చుట్టూవున్న అమ్మాయిలు ఇంకా మోడరన్‌గా వున్నారు. అందులో ఒక అమ్మాయి బెల్ బాటమ్స్ వేసుకుని, జడల్లేకుండా జుట్టంతా వెనక్కి దువ్వుకుంది. మరో అమ్మాయి స్లీవ్‌లెస్ జాకెట్టూ, పెదాలకు దట్టంగా పట్టించిన లిప్‌స్టిక్కూ, నాజూగ్గా ఎడం చేతికి వ్రేలాడేసిన కేనిట్ బ్యాగ్, రవికి అంతా అయోమయంగావుంది. సినిమాల్లోని గమ్మత్తైన సంఘటనలా వుంది.

రాజు ఇంకా నమ్మడం లేదులా వుంది. అందుకే తనకేం పట్టనట్టుగా నడుస్తున్నాడు. ఇరువురూ వారికి సమీపంగా వచ్చారు.

కళ్ళమీద పడుతున్న జుత్తును ఎడం చేత్తో వెనక్కి నెట్టేస్తూ వారి వైపు చూసి చిన్నగా మందహాసం చేశాడు రవి.

“హల్లో రవి గారూ! నమస్తె!!” అందా యువతి గబుక్కున.

అప్రతిభుడై పోయాడు రవి. రాజు కైతే ఆశ్చర్యంతో మతి పోయింది.

“నమస్తే!” తనూ చిరునవ్వుతో చేతులు జోడించాడు రవి.

“అయితే నన్ను గుర్తుపట్టారన్న మాట!” ఆ యువతి చిరునవ్వు నవ్వింది.

అవునన్నట్లుగా నవ్వుతూనే తలూపాడు రవి.

“ఎక్కడికో అర్జంటుగా వెళుతున్నారే!” అని ప్రశ్నించిందామె.

రవి నిర్ఘాంత పోయాడు ఆ అమ్మాయి చొరవకు. నిన్న బస్సులో తప్పితే ఆమెను జీవితంలో చూడలేదు రవి. అతనికి గమ్మత్ గా వుంది, ఆశ్చర్యంగా వుంది, సంతోషంగా వుంది. ఇంకా హృదయం నిండుగా ఏదో అందమైన అనుభూతి తాలూకు మైకం చోటు చేసుకుంటున్నట్టుగావుంది.

తేరుకొని స్నేహ పూర్వకంగా నవ్వాడు రవి. “అవునండీ! సాయంత్రం దాకా పనేంలేదు. అందుకే ఓ మార్నింగ్ షో చూద్దామనుకున్నాం. ధర్మేంద్ర పిక్చరు “ఫూల్ ఔర్ పత్తర్” నేను మిస్ అయ్యాను. అదే చూద్దాం అని విశ్రాంతి థియేటర్ దాకా వెళుతున్నాం” అని చెప్పి “మీరు కాలేజీ స్టూడెంటనుకుంటాను. ఏం చదువుతున్నారు?” తానూ ప్రశ్నించాడు చొరవగా.

ఆమె మృదువుగా నవ్వి అంది “ఇక్కడ సత్తెమ్మ నరసింహారావు కాలేజిలో బి. యస్. సి. ఫైనలియరు చదువుతున్నానండీ!”


“SELEKT”
MOTORS & PUMPS



FOR :—EFFICIANCY, ECONOMY AND TROUBLE FREE SERVICE.




*Manufactured by :*

CHITRA INDUSTRIES
COIMBATORE-641 005.
Grams: 'SELECT PUMP' Phone: 74548

: సేల్స్ బ్రాంచ్ :

చిత్రా ఇండస్ట్రీస్
5-1-446, రాణిగంజ్,
సికిందరాబాద్ - 3. (ఎ.పి.) ఫోన్ : 77826.

డిస్ట్రిబ్యూటర్స్ :

లక్ష్మి ఏజెన్సీస్
రాణిగంజ్ : : సికిందరాబాద్-3.

"మైగాడ్ !" అనుకున్నాడు మనసులో రవి.

ఫైనలియర్ చదువుతున్న ఈ అమ్మాయికి ఓనామాలు రావన్న మిత్రుని సైకాలజీని తగలబెట్టాలనిపించి అతని వైపు చూశాడు. రాజు తల ప్రక్కకు తిప్పుకుని మరో వైపుగా చూస్తున్నాడు. రవికి అతని ముఖంలోని ఫీలింగ్స్ అగపించలేదు.

అంతలో బస్సు వచ్చి అక్కడ ఆగింది. అమ్మాయిలంతా బస్సు వైపు కదిలారు. రవి కూడ ముందుకు అడుగు వేస్తూ "మేమూ వెళతాం ఇక !" అని ఒక్క క్షణం ఆగి "ఆఖరుగా ఒక్క మాట అడగాలనుకుంటున్నాను మిమ్మల్ని అని" అన్నాడు "ఏమిటో అడగండి" అంది.

" మీ పేరింకా చెప్పలేదు " అన్నాడు రవి.

"నా పేరు వాణి వస్తానండీ గుడ్ బై ! ' కళ్ళల్లో మెరుపులు మెరుస్తుండగా నవ్వి బస్సు ఎక్కేసింది.

రవి అలాగే తన్మయత్వంగా నిలబడిపోయాడు. రెండు నిమిషాల తర్వాత తేరుకుని ముందుకు అడుగులు వేశాడు.

"ఒరేయ్ రవీ! ఇది నిజంగా చాలా విచిత్రమైన సంఘటన కాదంటావా ?" రవి భుజం మీద చేయి వేస్తూ అన్నాడు రాజు.

"విచిత్రమైనదే కాదు మధురమైంది కూడా"

రవి మాటలకు కించిత్ ఆశ్చర్యపోయాడు రాజు. తర్వాత చిలిపిగా వీపులో దెబ్బవేసి అన్నాడు "ఏం రోయ్! మధురందాకా పోయిందేమిటి నీ ఆలోచన! అయితే బాగు పడ్డావన్నమాటే"

"అట్టే పిచ్చి వేషాలెయ్యక పద !"

రాజుకు చిర్రెత్తుకొచ్చింది "ఒరేయ్! పెళ్ళంటే వెనుకంజవేసేవాడివి. అమ్మాయిలతో అంత చొరవచేసి మాట్లాడతావెందుకూ" తీక్షణంగా చూస్తూ ప్రశ్నించాడు.

ఆ అమ్మాయే ముందుగా పలకరించింది. నేనేం చొరవ చెయ్యలేదు లేవోయ్! అయినా నీకెందుకింత మండు కొస్తోందో చెప్పు ముందు" రవి ముఖం చిట్లిస్తూ అన్నాడు.

"మాట్లాడావు సరె! అలా నవ్వుతావెందుకూ ?"

"ఏమిటోయ్! నీ యక్ష ప్రశ్నలు? నవ్వితే ఏమైందిట ?"

"నవ్వావు సరె! ఓ వెదవ నవ్వు నవ్వలేకపోయావూ? ఆ అమ్మాయి వైపు అలా అందంగా మందహాసం విసురుతావా ? నీ చిరునవ్వు ఆవిడ గుండెలోకి ఎలా సూటిగా దూసుకుపోయిందో! ఇక ఆ పిల్ల ఈ రోజంతా పరధ్యానంగా, తన్మయత్వంగా, నిన్ను గురించే తల పోస్తూవుంటుంది తెలుసా ?"

రాజు మాటలకు పక పక నవ్వాడు రవి "బాగుందిరా! నీ మానసిక శాస్త్ర విజ్ఞానం ఏడ్చినట్లుంది"

"అవునురా! నీ కిప్పుడలానే అన్పిస్తుందిలే" అన్నాడు రాజు.

రవి ఇక మాట్లాడలేదు. మౌనంగానే మిత్రులిరువురు థియేటర్ చేరుకునేసరికి బుకింగ్ మొదలైంది. త్వరగా టికెట్లు తీసికొని హాల్లోకి వెళ్ళిపోయారిద్దరూ.

పిక్చరు చూస్తున్నంతసేపూ రవి మనస్సులో ఆ అమ్మాయి రూపమే మెదులుతోంది. "వాణి ! ఎంత చక్కని పేరు. ఎంత అందంగా వుంది ఆ అమ్మాయి రూపం! బస్సులో చూసినప్పుడే ఆ పొడవైన ముక్కు, అందమైన పెద్ద కళ్ళూ, ఆకర్షించాయి తన్ను. ఇక ఈ రోజు అయితే చెప్పనవసరంలేదు. మెరుపులా మెరిసి తన హృదయం మీద చెరగని ముద్రవేసి పోయింది. 'రవిగారూ!' అని ఎంత తియ్యగా పిలిచిందో! ఆ నవనాగరిక దుస్తులు, కుడి చేతికి గడియారం, నల్లని పొడగాటి రెండు జడలు, అన్నిటికన్నా ప్రత్యేకం ఎడం చేతిలో పుస్తకాలను గుండెలకు అదుముకొని మందహాసం చిందిస్తూ బస్‌స్టాప్‌లో నిలబడిన భంగిమ! ఎంత మనోహరంగావుంది ? తమ పరిచయంకూడా చాలా విచిత్రంగానే జరిగింది. ఆ అమ్మాయిలోని చొరవ తన్ను ముగ్ధున్ని చేస్తోంది.

నడి రోడ్డుమీద తనంతట తాను పల్కరించటం తల్చుకుంటే రవికి వొళ్ళు పులకరించిపోతుంది. ఆమె ఇలా ఎక్కడో? తను తప్పుచేశాడు. ఆమె అడ్రసు

అడిగి వుండాల్సింది!' ఆలోచనల మధ్య కొట్టుకుపోతూ సినిమా ఏం చూశాడో తెలియని పరిస్థితిలో స్నేహితునితో కూడి బయటకు వచ్చాడు రవి.

సాయంత్రం నాలుగున్నర అయింది.

కేశవ్, రవీ, రాజా నీటుగా తయారై పెళ్ళి చూపులకు బయలుదేరారు.

కేశవ్ చాలా సరదా అయిన మనిషి. ఇరవైఎనిమిది సంవత్సరాల వయస్సు వుంటుంది. ఆంధ్రాబాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి దూరపు బంధుత్వమున్న రాజశేఖరంగారి పెద్దమ్మాయి సరోజను రాజుకిస్తే బాగుంటుందనే ఉద్దేశ్యంతో పరందామయ్యగారికి ఉత్తరం రాశాడు కేశవ్.

పరందామయ్యకూడా కేశవ్, మామగారనే పిలుస్తాడు. కేశవ్ మాటంటే ఆయనకు మంచి గురి. అందుకే ఉత్తరం చదవగానే తక్షణం రాజును పెళ్ళి చూపులకు హైదరాబాదు బయలుదేర తీశాడు.

తండ్రి మాటను వెంటనే తు. చ. తప్పకుండా అమలు జరిపే రాజు తన ప్రాణంలో ప్రాణంలా భావించుకునే రవితో తక్షణం బండి ఎక్కాడు ఇది అసలు వ్యవహారం.

రాజశేఖరంగారి ఇల్లు చాదర్‌ఘాట్ దాటాక వుంది. ఇప్పుడు బయలుదేరిన ముగ్గురు యువకులూ నడవటమంటె సరదా కన్నరిచేవాళ్ళే కనుక కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

కేశవ్ తమ బాంక్ ముచ్చట్లేవో మాట్లాడుతున్నాడు. రాజు, రవి వింటూ మెల్లగా నడుస్తున్నారు.

చల్లని పిల్ల వాయువులు వీస్తున్నాయ్. పగలంతా తన తీక్షణ కిరణాలతో ప్రపంచాన్ని భయపెట్టిన సూర్యుని ప్రతాపం అప్పటికి క్రమంగా నశించింది.

పగలంతా విసుగూ విరామం లేకుండా ఆఫీసుల్లో పనిచేసిన వాళ్ళంతా చల్లని గాలి పీలుస్తూ, హాయిగా కేరింతలు కొడుతూ రోడ్డమ్మట నడుస్తున్నారు

YET..
ANOTHER HUGE
EXPORT ORDER!!

FOR LEELA

LEELA, A SYNONYM
FOR QUALITY HOSIERY

*MFRS.:*

LEELA HOSIERY MILLS
RAYAPPAPURAM EXTN., :: TIRUPUR-638601

TEL: "ANDERGAD" PHONE: 21675

ఉస్మానియా హాస్పిటల్ మీద గోరింకలు. పావురాలు అరుస్తూ అటూ ఇటూ ఎగురుతున్నాయి.

రాజశేఖరంగారిది ఇల్లుకాదు. నిరాడంబరంగావుండి ఆకర్షణ వెదజల్లుతున్న రెండస్తులమేడ. కమల్ టాకీసు దాటాక కొద్దిదూరం వెళితే వస్తుంది. కేశవ్ ఆ కుటుంబంలో ఇదివరకు పరిచయమున్నవాడే కనుక గేటు తీసి లోపల ప్రవేశించాడు. కేశవ్ వెనకాలే అనుసరించి లోపలకు వచ్చారు రవీ రాజు.

మేడముందు, ముందు భాగంలోముచ్చటైన చిన్న తోటవుంది రకరకాల పూల చెట్లు నిండుగా పూసిన పూలతో వింత అందాలను విరజిమ్ముతున్నాయ్. పూల తాలూకు పరిమళం ముగ్గుర్నీ ఉన్మత్తపర్చింది.

తోట చిన్నదైనా వాటిని పెంచిన పద్ధతి చాలా నచ్చింది రవికి.

కేశవ్ మెట్లెక్కి గోడనున్న కాలింగ్ బెల్ మ్రోగించాడు. వెనకాల మిత్రులిద్దరి హృదయాలు అదో విధమైన ఉద్వేగంతో స్పందిస్తున్నాయ్.

రవి తలతిప్పి మిత్రుని పరిశీలనగా జూశాడు. నల్లని ఉలెన్ పాంటుమీద గులాబిరంగు టెర్రికాట్ షర్ట్ టక్ చేసిన రాజు, నీటుగా దువ్విన క్రాఫింగుతో నిండుగా, హుందాగావున్నాడు.

రవి తన్ను తాను చూసుకున్నాడు. పెద్దగా తయారై రాకపోయినా సింపుల్‌గా నీటుగానే వచ్చాడతను. మల్లేపూవులాంటి తెల్లని పైజామా మీద ఇంకా తెల్లని సెహ్రా షర్ట్ వేసుకున్నాడు.

కేశవ్ మరో మారు కాలింగ్ బెల్ నొక్కబోయే లోపునే తలుపులు తెరుచుకున్నాయ్. నౌకరు వీరయ్య కేశవ్‌ను చూసి నమస్కారంచేశాడు. ముగ్గుర్ని లోపలకు ఆహ్వానించి సోఫాలు చూపించాడు.

"బాబాయ్‌గారు లేరా వీరయ్యా!" అని ప్రశ్నిస్తూ సోఫాలో ఆసీనుడై టీపాయ్ మీది పేపరందుకున్నాడు కేశవ్.

"ఉన్నారు బాబూ! ఇందాకట్నుంచి మీ కోసమే. ఎదురు చూసి, ఇప్పుడే లోపలికెళ్ళారు. పిలుస్తానుండండి" అంటూ వీరయ్య లోపలికెళ్ళిపోయాడు.

రవి కూర్చుంటూ గదంతా ఓమారు కలియజూశాడు ఆడంబరంగా లేకపోయినా చాలా బాగుంది గది. మూడు సోఫాలు రెండు ఈజీ చైర్లూ, మధ్యలో టీపాయ్. గదిలో ఓమూలగా టేబుల్, దానిమీద అందంగా డిజైనలతో కూడిన టేబుల్‌క్లాత్. రేడియో సెట్టు, టైంపీస్, దాని ప్రక్కగా చిన్న స్టూలుమీద ర్యాలీఫ్యాన్, పైన తెల్లని గోడమీద దేశనాయకుల ఫోటోలు.

రవిని ఆ గది చాలా ఆకట్టుకుంది. గది పరిశీలనానంతరం, నుదుటిమీదకువస్తున్న క్రాపింగ్ నో మాటు వెనక్కి నెట్టేసుకుని, టీపాయ్ మీదున్న ఆంధ్రజ్యోతి వీక్లీ పేజీలు తిరగేసి కొమ్మూరి వేణుగోపాలరావుగారి డాక్టరుగారి డైరీ చదవటం ప్రారంభించాడు.

ఐదు నిమిషాలు దొర్లిపోయాక లాల్చీ, దోవతి ధరించిన ఓ నడి వయస్సు మనిషి డోర్ కర్టెన్ ప్రక్కకు తొలగించుకుని లోపల్నుంచి వచ్చాడు.

చదువుతున్న పేపరు క్రింద పడేసి నమస్కారం చేశాడాయనకు కేశవ్, వెనకే రాజు, రవీ కూడా నమస్కారం చేశారు.

ఆయనకూడా ప్రతి నమస్కారం చేసి ఈజీచైర్లో కూలబడుతూ "ఏమయ్యా కేశవ్! ఇంతాలస్యమయిందేం?" అని ప్రశ్నించి ఇరువురు యువకుల్నీ పరిశీలనగా చూశారు.

"ఏందండీ! ఐదు గంటలేగా అయింది. మా వాళ్ళు రిక్షాలో వద్దని సరదాగా నడిచి పోదామన్నారు. అందుకే ఈ కాస్త లేటయింది" అని నవ్వి కేశవ్, రాజునూ రవినీ రాజశేఖరంగార్కి పరిచయం గావించాడు.

"అయితే ఇతనేనన్నమాట మన పురందామయ్యగారి అబ్బాయి" రాజును పరిశీలనగా చూస్తూ అన్నారు రాజశేఖరంగారు.

"అవునండీ ఇతనే" కేశవ్ జవాబిచ్చాడు.

"పేరు ఏమిటన్నావు! రాజు కదూ?"

"అవునండి!"

"ఏమయ్యా రాజా! చదువుకుంటున్నావా? ఇప్పుడేం చదువుతున్నావ్?' హుందాగా ప్రశ్నించారు రాజశేఖరంగారు.

"అవునండీ! ఎం. ఏ. సైకాలజీ పైనలియర్" జవాబు చెప్పాడు రాజా.

"అలాగ ఎక్కడా?"

ఇక్కడే ఉస్మానియా యూనివర్సిటీలో"

"ఊఁ!" అని తలపంకించారు రాజశేఖరంగారు. ఆ తర్వాత ఇక ఏమీ మాట్లడలేదాయన. తదితర వివరాలన్నీ కేశవ్ ద్వారా ఇదివరకే విని వున్నందున అట్టే ప్రశ్నించలేదు.

తర్వాత వీరయ్య టిఫిన్ తెచ్చిపెట్టాడు. మౌనంగా అది ముగించి కాఫీలు తాగారు అందరూ.

రాజశేఖరంగారు ఈలోగా ఒకసారి లోపలకు వెళ్ళొచ్చారు. ఆయన మరో మారు గుమ్మందాక వెళ్ళి "అమ్మాయ్! వాణి!! అక్కయ్యను త్వరగా తీసుకు రామ్మా" అని కేకేసి తిరిగి వచ్చి కుర్చీలో కూచున్నాడాయన.

రాజా సోఫాలో కూర్చుని కేల చూపులు చూస్తూ వాలుగా గుమ్మం వైపు చూస్తున్నాడు.

రెండు నిమిషాలు భారంగా దొర్లిపోయాయ్. ఇంతలో డోర్ కర్టెన్ తొలగించుకుని ఇద్దరమ్మాయిలు లోనికి అడుగు పెట్టారు.

మెల్లగా కళ్ళెత్తి చూసిన రాజా, అప్పటికే వారి వైపు చూసిన రవీ, ఇరువురు ఒక్కసారిగా షాక్ తిన్నారు.

ఎదురుగా వాణి! నిన్న బస్సులో పల్లెటూరు పిల్లలా కన్పించిన వాణి!! పొద్దున బస్ స్టాప్‌లో నవనాగరిక దుస్తుల్లో మెరుపులా మెరిసిన వాణి!!!

రవి తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు. ఎదురుగా వాణి పరిస్థితికూడ అలాగే అయింది. వాణియే ముందుగా తేరుకుని పలకరింపుగా చిన్న మందహాసం చేసింది.

(4)

MAHENDRA

పంపులు - మోటారులు

మీరు....

ఎక్కువ పంటలు పండించుటకు



మహేంద్ర



పంపులు మరియు మోటారులను అమర్చండి.

"మహేంద్ర" ఎలెక్ట్రిక్ మోటారులు మరియు సెంట్రిఫ్యూగల్ పంపులు సింగిల్ ఫేస్, 3 ఫేస్ మోనోబ్లాక్స్ కప్పల్డ్ సెట్ మరియు బెల్ట్ పంపులు అన్ని సైజులలోనూ దొరుకును.

ఆంధ్ర ప్రభుత్వము వారిచే తక్కావి రుణములలో అంగీకరించబడినది.

: వివరములకు :

ఫోన్ : 30128. గ్రాంమ్ : "మహీపంప్"

MAHENDRA
ENGINEERING WORKS
Coimbatore-641037

రవికింకా కలయో వైష్ణవ మాయయో అన్నట్లుగా వుంది. నుదురుమీదకు జారుతున్న జుత్తును చేత్తో వెనక్కి నెట్టి, నవ్వాడు తనూ చిన్నగా.

"అమ్మా సరోజా! ఇలా కుర్చీలో కూర్చో తల్లీ" రాజశేఖరంగారు తన పక్కన సోఫా చూపిస్తూ కూతుర్ని పిలిచారు. సరోజ వెళ్ళి బిడియంగా కూర్చుంది.

కేశవ్ మౌనంగా రాజు వదనాన్ని పరిశీలిస్తున్నాయ్. రాజు ఒక్కక్షణంపాటు తలదించుకుని కూచున్న సరోజను చూశాడు. అమాయకంగా, పసితనం ప్రతిఫలిస్తున్న లేత ముఖంతో, ముగ్ధగా, అప్పుడే రేకులు విచ్చుకున్న గులాబిలా వుంది. రాజు అంతరంగం సంతోషతరంగిమై, సంతృప్తితో నిట్టూర్పు విడిచింది.

సరోజను గురించిన అన్ని వివరాలు రాజుకూ రవికీ ముందే చెప్పియున్నాడు కేశవ్. అంచేత ఎవ్వరూ ఏమీ ప్రశ్నించలేదు.

రవికి సరోజ మొదటి చూపులోనే నచ్చింది. రాజుకు తగిన భార్య అని భావించుకున్నాడు.

వాణి ఎందుకో కేశవ్ వైపు ప్రశ్నార్థకంగా చూసి కనుబొమ లెగరేసింది.

కేశవ్‌కు అర్థం కాలేదు. "ఏమిటమ్మా ఏదో అడగాలనుకుంటున్నావ్. అడుగు ఫరవాలేదు." అన్నాడు పైకే.

వాణి తడబడి పోయింది మొదట. కాని రెండు క్షణాల్లో తేరుకుని ధైర్యంగా అడిగింది. "మరి కేశవన్నయ్యా! వీరిద్దరిలో ఎవరు మా అక్కయ్యను చూడటాని కొచ్చారో అర్థం కాలేదు. అందుకే....." తర్వాత మాట పూర్తి చెయ్యక ముసి ముసిగా నవ్వింది.

రాజశేఖరంగారు మందహాసం చేశారు, కేశవ్ బిగ్గరగా పైకే నవ్వేస్తు "నీ చిలిపి తనం పోనిచ్చుకున్నావు కాదమ్మా వాణీ! ఇదిగో ఇతను రాజు. కాబోయే బావగారు. ఇక అతని పేరు రవి. మీ రాధ వదిన ముద్దుల తమ్ముడు నాకు బావమరిది. మామగారు అకస్మాత్తుగా పోవడంతో మెడిసన్ థర్డియర్‌తో ఆపు చేసి వ్యవసాయం చూస్తున్నాడు. మంచి రచయిత. ఇంకా మంచి క్రికెట్ ప్లేయర్' వివరంగా పరిచయం చేసాడిరువురిని.

రవి ఇబ్బందిగా కదిలాడు సోఫాలో. "ఏమిటీయన ఇంత వివరంగా తన్నెందుకు పరిచయం చెయ్యడం?" అనుకున్నాడు మనసులో.

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!




శాంతి డైమండ్స్

రసాయనిక వజ్రాలను తయారించుటలో ప్రసిద్ధి చెందియున్నాము.

: వివరములకు :

బి. కె. ఎస్. కన్నన్ & బ్రదర్స్

నెం. 37, పెద్ద సౌరాష్ట్ర వీధి, తిరుచిరాపల్లి-620008.

"అయితే రవిగారు రచయితన్నమాట! నేనెప్పుడూ ఆయన రచనలు చదివినట్టుగా లేదే! అంది వాణి. ఈ సారి ఆమె వదనంలో కుతూహలం గోచరించింది.

దానికి రాజు ఉత్సాహంగా కల్పించుకొని "మా వాడు కలం పేరుతో చేస్తాడు రచనలు. అందుకే మీరు సరిగా గుర్తించలేదు. వాడి కలం పేరు 'నవీన్'" అని చెప్పాడు.

ఈ సారి వాణితో పాటు, సోఫాలో బిడియంగా కూర్చున్న సరోజ కూడా ఉలిక్కి పడి తల యెత్తి రవి వంక ఆశ్చర్యంగా చూసింది.

"గుడ్ గాడ్! రచయిత 'నవీన్' మీరా?" మితి మీరిన ఆశ్చర్య సంతోషాలతో నోరు తెరచింది వాణి.

రవి సిగ్గుతో ఊపిరి సలప నంత పనైంది. "ఒరేయ్ రాజా! ఇప్పుడు నా గోడవెందుకురా! మీరేదైనా మాట్లాడాల్సిందుంటే మాట్లాడండి" అన్నాడు. స్నేహితుని వైపు చూస్తూ.

"మైగాడ్! నిజంగా ఈ రోజు చాలా సుదినం. నా అభిమాన రచయిత "నవీన్" గారి దర్శన భాగ్యం లభించింది." వాణి వదనంలో సంతోషం ఎంత అణుచు కుందామన్నా సాధ్యం కావటం లేదు. "జీవితంలో మిమ్మల్ని ఒక్కసారి అయినా చూద్దామనుకున్నాను రవి గారూ! ఆ కోరిక ఈ రోజు ఇలా తీరినందుకు నాకు ఆనందముతో మతి పోతుంది" ఉత్సాహంగా అంది.

రవి తీక్షణంగా బావగారైన కేశవ్ వైపు, మిత్రుడు రాజు వైపు మార్చి మార్చి చూశాడు. అతనికి కోపంగా వుంది. సమయం కాని సమయంలో తను రచయితగా పరిచయం గావింప బడి, అధికంగా పొగడ బడు తున్నందుకు. వాణి వైపు తిరిగి గంభీరంగా అన్నాడు. "చూడండి వాణీ! నా రచనలు మీకు నచ్చితే సంతోషం. కాని ఇప్పుడా పొగడ్తలు దయచేసి ఆపండి. ముందు మనం ఇక్కడకు వచ్చిన పనేమిటో కానివ్వండి."

సూటిగా, నిష్కర్షగా వచ్చిన రవి మాటలకు వాణి ఉత్సాహం నీరుగారి పోయింది. ఆమె అహం కొద్దిగా


# శుభవార్త
## "ఎస్" బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్సు ఎ. హబీబుర్ రహమాన్ అండ్ సన్సు గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు అనేక ఇంటర్నేషనల్ ఫైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్‌ఫైర్) స్వీడన్, బెల్జియమ్, సింగపూర్ మున్నగు దేశాలలోనేకాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాల లోకూడా వీటిని ప్రవేశపెట్టారు. ఎస్. బీడీలకు వారు తయారుచేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టెవంటి పాకెట్‌లో కొత్త రూపు, అందచందాలుకూడా ఏర్పడ్డాయి.

ఆద్యతన భవిష్యత్తులో అమెరికా, యూరోపుఖండాలలో నాగరిక ప్రజలలో నైతిక అభిమానునను పెంచుకొని ఎస్. బీడీ సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢ పరుస్తున్నది.

దెబ్బతినింది. అందుకే మౌనంగా వుండిపోయింది. కాని ఆమె ముఖం వివర్ణం కావటం రవి గుర్తించాడు.

ఇక ఎవ్వరూ మాట్లాడలేదు. ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచి పోయినతర్వాత సరోజ లేచి లోపలకు వెళ్ళి పోయింది. వాణి కూడా వెళ్ళడానికి ముందుకు అడుగు వేసింది. కాని రాజశేఖరంగారు పిలవడంతో ఆగి పోయింది.

"చూడమ్మా వాణీ! అమ్మతో భోజనాల ప్రయత్నం చెయ్యమని చెప్పు. ఈ రాత్రికి వీళ్ళంతా ఇక్కడే భోజనం చేస్తారు."

అబ్బే వద్దు బాబాయ్! కేశవ్ కంగారుగా అన్నాడు. "మేము వెళ్ళిపోతాం అక్కడ రాధ వంట చేసివుంటుంది"

రాజశేఖరంగారు మందహాసంచేశారు "చేస్తే చేసింది లేవయ్యా కేశవ్! మరేం ఫరవాలేదు"

"ఇక్కడ భోంచేసి వెళ్ళేసరికి చాలా ఆలస్యమవుతుంది బాబాయ్! చాలా రాత్రివుతుందేమో కూడా!"

"అబ్బే! ఏమీ కాదులే"

"అక్కడ రాధ వంటరిగా ఎదురు చూస్తూవుంటుంది" నసిగాడు కేశవ్.

"ఫరవాలేదు లేవోయ్ ఎంతసేపు కి." అని నవ్వి రాజశేఖరంగారు గుమ్మందాకా వెళ్ళి కర్టెన్ తొలగించి లోపలికి తొంగి చూస్తూ "అమ్మాయ్ వాణీ! వంట కాస్త త్వరగా కానీయండమ్మా! కేశవులన్నయ్య వెళ్ళి పోతానంటున్నాడు" అని కేకేశారు.

తర్వాత అంతా బయట పూలతోట లోకి వచ్చారు. నౌకరు వీరయ్య కుర్చీలు తెచ్చి బయట పచ్చికలో వేశాడు. నల్గురూ కూర్చుని చిన్నగా కబుర్లు ప్రారంభించారు. చర్చ మెల్ల మెల్లగా రాజకీయాల్లోకి దొర్లింది.

రాజకీయాల్లో రాజుకు కొద్దో, గొప్పో పరిచయముండటం వల్ల మధ్య, మధ్య చిన్నచిన్నగా కామెంట్ చేస్తున్నాడు.

రవికి రాజకీయాలకూ, నక్కకూ నాగలోకాని కున్నంత కాకపోయినా, కాశ్మీరుకూ, శ్రీలంక కున్నంత దూరముంది. అందుకే వారి కబుర్లలో పాల్గొనకుండా తోటలోని విరబూసిన పూలవంక దీర్ఘంగా చూస్తూ వుండి పోయాడు. అతనికి అకస్మాత్తుగా వాణి తలపుకు వచ్చింది. 'తను అనవసరంగా తొందర పడ్డాడు. అభిమానమనేది ఎవరికైనా వుంటుంది. ఆ మాటకొస్తే తను ఇండియన్ ఓపెనింగ్ బాట్స్‌మెన్ కల్సుకోవాలని ఉవ్విళ్ళూరటం లేదూ తను? ఆమె కూడా అంతే! తన్ను అభిమాన రచయితగా భావించుకుంది, తను కన్పించగానే ఆనందం ఆపుకోలేక పోయింది. దానికి తాను అలా అన్ని వుండకూడదు. మనస్సులో చాలా నొచ్చుకుని వుండొచ్చు. ఆ ఎర్రబడిన ముఖమే చెప్పిందా విషయం. వాణి చాలా గారాబంగా పెరిగి నట్టుంది. పైగా కుహా చిలిపిదిలావుంది' ఆలోచిస్తున్న రవి పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయ్.

నౌకరు వీరయ్య మెల్లగా రవి దగ్గరగా వచ్చాడు. తలకొంచెం వంచి "రవిబాబూ! చిన్నమ్మాయిగారు మిమ్మల్ని లోపలకు రమ్మంటున్నారు" గొంతు తగ్గించి అన్నాడు.

"నన్నా!" రవి తొట్రుపాటుతో తలెత్తి చూశాడు. రాజశేఖరంగారు, రాజూ, కేశవ్ మాటల్లో మునిగి వున్నారు. అందుకె ఎవ్వరూ వీరయ్య అన్న మాటలు విన్నట్లు లేదు.

రవి మెల్లగా లేచి, మెట్లెక్కి వెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లో ప్రవేశించాడు. వాణి సోఫాలో కూర్చున్నదల్లా రవిని చూడ్డంతోనే లేచి నిలబడింది.

"పిలిచారెందుకు?" వచ్చేరాగానే అన్నాడు రవి.

వాణి వెంటనే మాట్లాడలేదు. తర్వాత కొద్ది సేపటికి తల వంచుకొని మెల్లగా అంది. "మీ కింతక్రితం అనవసరంగా కోపం తెప్పించాను వెరిసారీ!"

(సశేషం)

★